జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ప్రధాన సమస్యలపై కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్ దృష్టి సారించారు. సంబంధిత అంశాలను లోతుగా పరిశీలించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఏళ్ల తరబడి మొదలు కాకుండా, అర్ధంతరంగా ఆగిపోయిన ముఖ్యమైన పెండింగ్ పనులకు సంబంధించిన ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి. ఇప్పటికే నాలుగైదు ముఖ్య సమస్యలు పరిష్కారం కాగా మరికొన్ని ఆ దిశగా ముందుకు వెళుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



సమన్వయంతో వీడిన చిక్కుముడి

● ఏళ్లనాటి పెండింగ్ సమస్యలపై కలెక్టర్ దృష్టి ● వేగంగా కదులుతున్న ఫైళ్లు

ఏర్పేడు ఆర్వోబీ కదిలింది

తిరుపతి - వెంకటగిరి జాతీయ రహదారిలో ఏర్పేడు సమీపాన రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ మంజూరై ఆరేళ్లవుతోంది. నిర్మాణానికి భూసేకరణ జరిపే క్రమంలో 1.27 ఎకరాల అటవీ భూమి సమస్యగా మారింది. ఆ భూమిని జాతీయ రహదారుల శాఖ పేరిట బదలాయించడానికి అటవీ శాఖ నుంచి అనుమతులు రాలేదు. దీంతో ఐదేళ్లుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు కాకుండా పెండింగులో ఉన్నాయి. కలెక్టర్ చొరవతో ఎట్టకేలకు గత నెల 25వ తేదీన అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చాయి. దీంతో పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

తిరుపతి-వెంకటగిరి జాతీయ రహదారిపై ఏర్పేడులో రైల్వే గేటు వద్ద పెండింగ్ పడిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

కొలిక్కి వచ్చిన పనపాకం ఫ్లైఓవర్



చంద్రగిరి మండలం పనబాకం వద్ద పూతలపట్టు-నాయుడుపేట ఆరు వరుసల జాతీయ రహదారిలో నిలిచిపోయిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు

పూతలపట్టు-నాయుడుపేట ఆరు వరుసల జాతీయ రహదారిలో చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ రమణప్పగారిపల్లి వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాల్సి ఉంది. రైతులు పరిహారం పెంచాలని కోరుతూ భూములు అప్పగించలేదు. దీంతో ఫ్లై ఓవర్ నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. సుమారు 700 మీటర్ల మేరకు పనులు పెండింగులో పడ్డాయి. ఐదేళ్లుగా సమస్య పరిష్కారం కాలేదు. ఫ్లై ఓవర్ నిర్మాణం అసంపూర్తిగా ఉందని తెలియక వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటి దాకా 20 మంది దాకా ప్రమాదాల్లో చనిపోయారు. కలెక్టర్ రమణప్పగారిపల్లి రైతులతో మాట్లాడి వ్యవసాయ భూములు కన్వెర్షన్ చేయించడం ద్వారా ఎక్కువ పరిహారం ఇప్పిస్తామంటూ ఒప్పించారు. దీంతో నిర్మాణం కొలిక్కి వచ్చింది. త్వరలో పనులు మొదలు కానున్నాయి.

సీబీఐసీ భూసేకరణకు పచ్చజెండా

చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నం గ్రామాల్లో 985 ఎకరాల ప్రభుత్వ అనాధీన భూములను ప్రభుత్వం కేటాయించింది. ఈ భూముల్లో తాము పంటలు సాగు చేసుకుంటున్నందున తమకు పరిహారం ఇవ్వాలని 600 మంది రైతులు కోరుతున్నారు. పనులు అడ్డుకుంటున్నారు. దీంతో 2016 నుంచి భూముల సేకరణ పెండింగులో పడింది. కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారం ఇప్పించేలా కృషి చేశారు. దీంతో ఆ భూముల్లో ఇండస్ట్రియల్ కారిడార్ కింద రూ.1,400 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి.

చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం కోట మండలం కొత్తపట్నం వద్ద ఇటీవల సేకరించిన భూములు



రేణిగుంట రైల్వే బైపాస్ ఇక జోరు

రేణిగుంట రైల్వేస్టేషన్‌కు రైల్వే బైపాస్ 2018లో మంజూరైనా పనులు జరగలేదు. కేవలం 2 ఎకరాల భూమి సేకరించే విషయంలో సమస్య ఎదురైంది. కొత్త ట్రాక్ కోసం సేకరించాల్సిన రెండెకరాల భూమిలో ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన 51 కుటుంబాలు నివాసముంటున్నాయి. అందులో షికారీలు కూడా ఉన్నారు. రైల్వే శాఖ పరిహారం మంజూరు చేసినా వారు ఇళ్లు ఖాళీ చేయలేదు. ఆరేళ్లు గడిచిపోయాయి. ఈ అంశాన్ని గత జనవరిలో నారావారిపల్లికి వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. దీంతో షికారీలకు పరిహారం, అద్దెలకు సంబంధించి రూ.14 కోట్లు సీఎం విడుదల చేయించడంతో సమస్య పరిష్కారమైంది. బైపాస్ వల్ల రేణిగుంటలో ఆగాల్సిన అవసరం లేని రైళ్లు, గూడ్సులు నేరుగా రాకపోకలు సాగించేందుకు వీలవుతుంది. రేణిగుంట స్టేషన్‌లో అనేక రైళ్లు క్రాసింగ్ పేరుతో ఆగిపోవాల్సిన అవసరం తగ్గుతుంది.

పెండింగ్‌లో ఉన్న రేణిగుంట రైల్వే బైపాస్ లైన్ పనులు



తూకివాకం ఓవర్ బ్రిడ్జికి మోక్షం

రేణిగుంట మండలం తూకివాకం వద్ద పూతలపట్టు-నాయుడుపేట ఆరు వరుసల జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పన్నెండేళ్లుగా సాగుతోంది. ఇరువైపులా విస్తరణ పనులైతే జరిగిపోయాయి కానీ ఓవర్ బ్రిడ్జి మాత్రం కట్టలేదు. దీంతో అక్కడ ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌లు సంభవిస్తున్నాయి. తిరుపతి మీదుగా చెన్నై, బెంగళూరు, విజయవాడ, కడప తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ మార్గం కీలకం. ఎందుకు ఆగిపోయిందని కలెక్టర్ ఆరా తీస్తే.. ఆరు గంటల పాటు రైళ్ల రాకపోకలు ఆపితేనే బ్రిడ్జి నిర్మాణం సాధ్యం అని తెలిసింది. జాతీయ రహదారుల ఇంజనీరింగ్, రైల్వే అధికారుల నడుమ సమన్వయం, సహకారం లేకపోవడంతో ఇంత చిన్న సమస్య పన్నెండేళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయింది. కలెక్టర్ చొరవ తీసుకుని సమన్వయం కుదిర్చారు. దీంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. నెలలో పూర్తి కానున్నాయి.

శెట్టిపల్లి భూములకు త్వరలో పరిష్కారం

తిరుపతి అర్బన్ మండలంలోని శెట్టిపల్లి రెవెన్యూ గ్రామం ఇప్పటి వరకూ రెవెన్యూ పరంగా సెటిల్‌మెంట్ కాలేదు. బ్రిటీష్ పాలన నుంచి కూడా ఇక్కడి భూములు సర్వేకి గానీ, రికార్డుల్లో నమోదుకు గానీ నోచుకోలేదు. దీంతో ఇక్కడ భూములు సాగుచేసుకుంటున్న రైతులకు గానీ, స్థలాల యజమానులకు గానీ, భవనాల యజమానులకు గానీ వాటిపై ఎలాంటి హక్కులూ లేకుండాపోయాయి. 50 ఏళ్లుగా ఈ సమస్యకు పరిష్కారం కోసం జరిగిన ప్రయత్నాలు ఫలించలేదు. తాజాగా దీనిపై దృష్టి పెట్టిన కలెక్టర్ రైతులు, స్థలాల యజమానులతో సమావేశాలు నిర్వహించి, ఎట్టకేలకు పరిష్కార దిశగా ప్రతిపాదనలు రూపొందించారు. వాటిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపించారు. నాలుగు వారాల్లో శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

తిరుమల ఘాట్ రోడ్ల మరమ్మతుపై మల్లగుల్లాలు

● త్వరలో నివేదిక సమర్పించనున్న ఐఐటీ నిపుణులు



సీసీ రోడ్డులోని పగుళ్లకు వేసిన తారు

తిరుమల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్ల మరమ్మతులపై టీటీడీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. వాహనాల రద్దీ కారణంగా మరమ్మతులకు పూనుకోవడం ఇబ్బందిగా మారుతోందని చెబుతున్నారు. కొత్త సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తే రాకపోకలకు రెండవ ఘాట్ రోడ్డుపై ఆధారపడాలి. దీనివల్ల చాలా ఇబ్బంది కలుగుతుందని భావించి ఆరేడేళ్లుగా చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. ఈ క్రమంలో టీటీడీ అధికారులు ఇటీవల ఐఐటీ నిపుణుల బృందాన్ని సంప్రదించారు. కొన్ని రోజుల క్రితం నిపుణులు ఘాట్ రోడ్లను పరిశీలించారు. వారిచ్చే నివేదికను బట్టి తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

రోడ్లలో భారీగా పగుళ్లు..

1940లో ఆనాటి మహంతులు మొదటి ఘాట్ రోడ్డు నిర్మించారు. మూడేళ్లలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఈ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. 1974లో రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగే వరకు మొదటి ఘాట్ రోడ్డులోనే రాకపోకలు జరిగేవి. దీనికి అనుగుణంగానే అప్పటి అధికారులు 55 మలుపులతో నిర్మించారు. కాలానుగుణంగా మట్టిరోడ్డు సీసీ రోడ్డుగా, తారు రోడ్డుగా మారుతూ వచ్చింది. మలుపుల్లో సీసీ రోడ్డు, సాఫీగా ఉన్న చోట తారు రోడ్డు ఉంది. అయితే మలుపుల్లోని సీసీ రోడ్డు పగుళ్లు ఇబ్బందికరంగా మారాయి. చాలాచోట్ల పగుళ్లతో పాటు గుంతలు కూడా ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల వాహనాలు వెళుతుంటే శబ్దాలు కూడా వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రయాణం సాఫీగా సాగడంలేదు. టీటీడీ అడపాదడపా పగుళ్లకు తారుపూసి సరిపెడుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



మహిళలకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, కమిషనర్ మౌర్య తదితరులు



అవకాశాలు అందిపుచ్చుకుంటే... ఆకాశమే మీ హద్దు!

మహిళలకు అన్ని విధాలుగా ప్రభుత్వ ప్రోత్సాహం

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ప్రముఖుల పిలుపు

తిరుపతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక పురోగతి సాధించేలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని, సద్వినియోగం చేసుకుంటే ఆకాశమే హద్దుగా ఎదగవచ్చని అధికార, అనధికార ప్రముఖులు ఆకాంక్షించారు. శనివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య ఇతర అధికార ప్రముఖులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తూ కుటుంబ అభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలు అతిపెద్ద నెట్‌వర్క్‌గా రూపుదిద్దుకొని ప్రపంచ దేశాలు అవలంబించేలా చేసినందుకు గర్వకారణంగా ఉందన్నారు. విద్య, ఉద్యోగాల్లో మహిళలు ఎక్కువగా రాణిస్తుండడం శుభపరిణామమన్నారు. మహ్మద్ ప్రవక్తతో 13ఏళ్ల పాటు యుద్ధం చేసిన రాజ్‌పుత్ వంశానికి చెందిన 'నయిని' వీర గాథను వివరించారు. అలాగే ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పుత్తూరు మహిళ చంద్రకళ కథనాన్ని ప్రస్తావించారు. దారుశిల్ప కళను ఆమె బతుకుదారిగా మలుచుకున్న వైనం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుతుండడం సంతోషం కలిగిస్తోందన్నారు.వారికి అన్ని రంగాల్లో పురుషులతో సమాన హక్కులు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మహిళలు ఒకరికొకరు సహకరించుకుంటూ ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌లు మాట్లాడుతూ దివంగత సీఎం ఎన్టీఆర్ తొలిసారిగా మహిళా రిజర్వేషన్లు కల్పించి వారి ఎదుగుదలను ప్రోత్సహించారన్నారు. ఆస్తిలోనూ సమాన హక్కు వచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. మహిళల కోసం తిరుపతిలో మహిళా విశ్వవిద్యాలయం నెలకొల్పారని అన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రగడ నారాయణలు మాట్లాడారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు, పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన, స్వయం సహాయక మహిళలకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. డీఆర్డీఏ నుంచి ఉన్నతి, బ్యాంకు లింకేజీ, పీఎంఎఫ్‌జేఏపై చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, ఏఎస్పీ రవిమనోహరాచారి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, మహిళా సంఘాలు, సీడీపీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 8,201 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి గురునాథ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న కోర్టుల్లో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమాల్లో 8,201 కేసులు పరిష్కారమయ్యాయి. చిత్తూరులో 2905 కేసులు, తిరుపతిలో 2251, పుత్తూరులో 807, పలమనేరులో 428, శ్రీకాళహస్తిలో 285, కుప్పంలో 269, సత్యవేడులో 230, పుంగనూరులో 224, నగరిలో 184, మదనపల్లెలో 163, తంబళ్లపల్లెలో 150, వాయల్పాడులో 134, పీలేరులో 89, పాకాలలో 82 కేసులు పరిష్కారమయ్యాయి. తిరుపతిలో రూ.5.38 కోట్లు విలువ చేసే కేసులు పరిష్కరించినట్లు మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్ చెప్పారు. వీటితో పాటు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మరో 363 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. 1,880 పెనాల్టీ కేసులు సైతం పరిష్కారమయ్యాయని చెప్పారు. కాగా, విడాకుల కోసం కోర్టుకెక్కిన ఒక జంట పుత్తూరు లోక్ అదాలత్‌లో తిరిగి ఒక్కటయ్యారు. విడాకులు కోరుతూ కోర్టుకెక్కిన నారాయణవనానికి చెందిన గురుచరణ్, పుత్తూరు ఎన్జీవో కాలనీకి చెందిన పద్మప్రియ దంపతులు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర మంచిమాటలతో మనసు మార్చుకున్నారు. శనివారం ఆయన సమక్షంలోనే పూలదండలు మార్చుకుని కలసి ఇంటికి వెళ్లడం విశేషం.

జనసేన నేత కిరణ్‌రాయల్‌పై కేసు కొట్టివేత

- లోక్ అదాలత్‌లో రాజీపడ్డ లక్ష్మి -

తిరుపతి(నేరవిభాగం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్‌పై ఇటీవల నమోదైన కేసును లోక్ అదాలత్‌లో కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు. తన వద్ద డబ్బులు తీసుకుని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ తిరుపతికే చెందిన లక్ష్మిరెడ్డి అనే మహిళ ఎస్వీ యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో కిరణ్‌రాయల్‌పై ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదయ్యింది. ఈ కేసుకు సంబంధించిన కొన్ని వీడియోలను సైతం ఆమె రిలీజ్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కిరణ్‌ను జనసేన వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో శనివారం తిరుపతిలో జరిగిన లోక్ అదాలత్‌కు వారు హాజరయ్యారు. ఇద్దరినీ న్యాయమూర్తి విచారించాక రాజీపోవడంతో కిరణ్‌పై నమోదైన కేసును కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు.

శ్రీసిటీలో మహిళా దినోత్సవం

● పాల్గొన్న షార్ శాస్త్రవేత్తలు

శ్రీసిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ మహిళా శాస్త్రవేత్తలు, శ్రీసిటీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన ఈ వేడుకలను మమతా సన్నారెడ్డి, తిరుపతి ఏఎస్పీ విమలా కుమారి, షార్ సీనియర్ సైంటిస్ట్ లత ప్రారంభించారు. అతిథులకు శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ విజయంలో మహిళా ఉద్యోగుల పాత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చర్చల్లో పలువురు మహిళా ఉద్యోగులు వారి అనుభవాలను పంచుకున్నారు.



పెప్సికో పరిశ్రమ వద్ద షార్ శాస్త్రవేత్తల బృందంతో నిరీషా సన్నారెడ్డి

వెటర్నరీ విద్యార్థినుల వినూత్న నిరసన



నల్ల దుస్తులు ధరించి నోటికి నల్ల మాస్క్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ విద్యార్థినులు

తిరుపతి రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ క్రమంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వర్సిటీ ప్రధానగేటు ఎదురుగా విద్యార్థినులంతా నల్లదుస్తులు ధరించి, నోటికి నల్లమాస్కులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.హ్యాపీ వుమెన్స్ డే తరకు లేదంటూ చేతులకు నల్లరంగు పూసుకుని తెలుపురంగు ఆంగ్ల అక్షరాలలో సేవ్ వెట్స్ అంటూ ప్రదర్శన ఇచ్చారు. సమానత్వం, న్యాయం, గౌరవం లభించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.25
సహరి (సోమవారం) : 5.05

మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం: నాని



డ్వాక్రా సంఘులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ఎర్రావారిపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో 712 మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన 7325 మంది సభ్యులకు పావలా వడ్డీ కింద రూ.4.35 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ మేలో తల్లికి వందనకం కింద బడిపిల్లలకు రూ.15వేల వంతున ప్రభుత్వం సహాయం అందజేస్తుందన్నారు. జూన్ చివరి నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తుందన్నారు. డ్వాక్రా సంఘ లీడర్లను శాలువాతో సన్మానించారు. వారు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నడింపల్లె రోడ్డు మంజూరుచేస్తునానమన్నారు. సమావేశంలో తహసీల్దార్ పరమేశ్వర స్వామి, ఏపీఎం తిరుమలరాజు, ఈఓపీఆర్డీ మాలతి,టీడీపీ నాయకులు దేశిరెడ్డి రఘునాథ, మహేష్ నాయుడు, కల్పా రవి,కొమ్మక లక్ష్మిదేవి,మల్లార్ దేవి, సోమనాథరెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 82 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి శ్రీనివాస్

పాకాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలంఓని కోర్టు ఆవరణలో శనివారం సివిల్ జడ్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అధాలత్ నిర్వహించారు. 82 సివిల్, క్రిమినల్, పెట్టి కేసులను పరిష్కరించారు. రూ. 11,12,000లకు సంబంధించిన వివాదాలు పరిష్కారమయ్యాయి. లోక్ అధాలత్ సభ్యుడు ఎస్ఎస్ఎం సలీం, స్థానిక న్యాయవాదులు, పోలీసులు, పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థుల సరస్వతీ పూజ



తిరుచానూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టులోని సరస్వతి విద్యాలయంలో శనివారం పదవ తరగతి విద్యార్థులతో సరస్వతి పూజ చేయించారు. అనంతరం వీడ్కోలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమేష్, ప్రిన్సిపాల్ కాంతారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెప్పోత్సవాలకు సిద్ధం



తిరుమలలో ఆదివారం నుంచి మొదలు కాబోతున్న శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీప కాంతులతో పుష్కరిణి వెలిగిపోతోంది. తొలిరోజు సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి, రెండవ రోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి మాడవీధుల్లో ప్రదక్షిణంగా ఊరేగుతూ వచ్చి పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు విహరిస్తారు. ఇక, శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తెప్పపై మూడోరోజు మూడు చుట్లు, నాల్గోరోజు ఐదు చుట్లు, చివరిరోజు ఏడు చుట్లు విహరించి భక్తులను కటాక్షిస్తారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ మన్మోహన్ కుటుంబ సభ్యులు

తిరుచానూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజ స్తంభానికి అనంతరం సన్నిధిలో అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం జస్టిస్ మన్మోహన్‌ను వేదపండితులు ఆశీర్వదించారు. అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

టైలరింగ్ శిక్షణా కేంద్రం ప్రారంభం



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధారెడ్డి

చంద్రగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పనపాకం పంచాయతీలో ఏపీ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఈ శిక్షణా కేంద్రాన్ని టీడీపీ మహిళ నేత పులివర్తి సుధారెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కిందన్నారు. మహిళల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అనంతరం స్వయం సహాయ సంఘాలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్ సుభాషిణికి సన్మానం



సుభాషిణి దంపతులను సన్మానిస్తున్న మహిళలు

తిరుపతి రూరల్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె పంచాయతీ సర్పంచ్ బి.సుభాషిణి అధ్యక్షతన శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల జాతీయస్థాయిలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న ఈసందర్భంగా సుభాషిణికి అభినందన కార్యక్రమం జరిగింది. వార్డుసభ్యులు, ఎంపీటీసీలు, మహిళలు హాజరై సర్పంచ్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులతో పాటు పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చేందుకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామన్నారు. రూములను ప్రలోభాలకు అవకాశం లేకుండా వేలం ద్వారా కేటాయించామన్నారు. పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. శుభగిరినాయుడు, కార్యదర్శి సుజాత, మహిళలు పాల్గొన్నారు.

అదనంగా 38 బస్సులు అవసరం



సమీక్షిస్తున్న ఆర్టీసీ ఈడీలు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 8(ఆంధ్రజ్యోతి): వివిధ రూట్లలో మరో 38 బస్సులు అవసరముందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అప్పలరాజు, చంద్రశేఖర్‌లకు జిల్లా అధికారులు ప్రతిపాదించారు. శనివారం స్థానిక ప్రజారవాణాధికారి కార్యాలయంలో వీరు అధికారులతో సమావేశమయ్యారు. గతేడాది రాబడి లక్ష్యంరూ.563 కోట్లు నిర్దేశించగా ఇప్పటివరకూ రూ. 535కోట్లు లభించిందని అప్పలరాజు చెప్పారు. ఈ నెలాఖరులోపు మిగిలిన లక్ష్యం పూర్తిచేయాలని సూచించారు. ఆదాయంలో అలిపిరి డిపో రూ. 102కోట్లు టాప్‌లో ఉందని గుర్తించారు. వచ్చేఆర్థిక సంవత్సరానికి రూ.650 కోట్లకు పైనే లక్ష్యం నిర్దేశించవచ్చన్నారు. అనంతరం ప్రమాదాల నివారణ, సేవలపై చర్చించారు.

స్విమ్స్‌లో ఎస్ఆర్ డాక్టర్ల పోస్టులకు 14న ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల (అడహక్ బేసిక్ పద్ధతిన) పోస్టులకు ఈ నెల 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా తెలిపారు. 38 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పాత డైరెక్టర్ కార్యాలయ కమిటీ హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వివరించారు. హిందూ మతానికి చెందిన వారు మాత్రమే ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె వివరించారు.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి8(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులూ వేచిఉన్నారు. గురువారం నాటి హుండీ ఆదాయం రూ.3.47 కోట్లు లభించింది. శుక్రవారం 67,127 మంది దర్శించుకోగా 22,910 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

తిరుమలలో నటుడు శ్రీనివాస్‌రెడ్డి



తిరుమల, మార్చి8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం సినీ నటుడు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి దర్శించుకున్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ సీజ్



రామచంద్రాపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సి.రామాపురం వద్ద అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం అధికారులు సీజ్ చేశారు. ఆర్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వినా,ఇష్టారాజ్యంగా తవ్వినా అక్రమరవాణా చేసినా వాహనాలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గుణభూషణనాయుడు, నరసింహులు, వెంకటరమణ, బాబు, ప్రదీప్‌నాయుడు, పోలీసులు ఓబుల్‌రడెడ్డి, యోబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 29,687 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు శనివారం 29,687 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పేపర్ -1బి, జువాలజీ పేపర్ -1, హిస్టరీ పేపర్ -1 పరీక్షలు జరిగాయి. 30,338 మందికి గానూ 651 మంది విద్యార్థులు గైర్హాజరవగా 29,687 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

తిరుచ్చి వాహనంపై భక్తులకు అభయం

చంద్రగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం కన్నులపండువగా ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. స్వామి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

చంద్రారెడ్డిని పరామర్శించిన పురందేశ్వరి



పురందేశ్వరికి పద్మావతి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న చంద్రారెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), మార్చి 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తిరుపతికి చెందిన చంద్రారెడ్డిని పరామర్శించారు. చిత్తూరులో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె శుక్రవారం జిల్లాకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఇటీవల మోకాలికి శస్త్ర చేయించుకుని విశ్రాంతి తీసుకుటున్న చంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి పద్మావతి అమ్మవారి చిత్ర పటాన్ని అందించి సత్కరించారు. బీజేపి తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులతో సహపంక్తి భోజనం

తిరుపతి, మార్చి8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక దేవేంద్ర థియేటర్ సమీపంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సుగుణ, ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి.రమణ పారిశుధ్య కార్మికులతో సహపంక్తి భోజనం చేశారు.

మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వ తోడ్పాటు

జడ్పీ సీఈవో రవికుమార్





ఐతేపల్లిలో సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న అధికారులు- పాకాల సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో మహిళలు

చంద్రగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక పురోగతి సాధించేలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని జడ్పీ సీఈవో రవికుమార్ తెలిపారు. ఐతేపల్లె పంచాయతీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ షేక్ ఫజిలా అధ్యక్షతన జరిగిన సభ లో ముఖ్య అతిథులుగా చిత్తూరు జడ్పీ సీఈవో రవికుమార్, తిరుపతి జిల్లా డీపీవో సుశీలాదేవిలు హాజరయ్యారు. రవికుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన, లింగ సమానత్వం, మహిళా సాధికారిత దిశగా ముందడుగు వేయాలన్నారు. జిల్లా డీపీవో సుశీలాదేవి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. సర్పంచ్ షేక్ ఫజిలా, మహిళా వార్డు సభ్యులు, సిబ్బందిని సన్మానించారు. ఎంపీడీవో శేఖర్, ఈవోఆర్డీ వెంకటరత్నం,ఎంఈవో లలితకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు. **పాకాల:** కావలివారిపల్లె పంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవాన్ని సర్పంచ్ చెంగల్రాయులు నిర్వహించారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.సావిత్రి, కార్యదర్శి బషీరా, విజయ, వెంకటరత్నమ్మ, లక్ష్మీదేవి, అంగన్‌వాడీ సిబ్బందిని సన్మానించారు. పాకాలలో సర్పంచ్ కస్తూరి, కార్యదర్శి లావణ్యలతల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ బీసీ సాధికార సమితి పాలఏకిరి మహిళా మండల అధ్యక్షురాలు నందీశ్వరిని సన్మానించారు.సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో స్త్రీల మైత్రి సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

తిరుపతి రూరల్: చిగురువాడ పంచాయతీలో కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి కేట్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సర్వే సిబ్బందికి సమాచారం అందించి సహకరించాలని కోరారు.

ఉత్తమ కండక్టర్‌గా రత్న



ఆర్టీసీ అధికారి ప్రశాంతి నుంచి అవార్డు అందుకుంటున్న కండక్టర్ రత్న

సూళ్లూరుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సంగన రత్న జిల్లా స్థాయిలో ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆర్టీసీ ఉద్యోగులకు జిల్లా స్థాయిలో పురస్కారాలు అందించారు. శనివారం తిరుపతిలోని అలిపిరి డిపోలో ఆర్టీసీ అధికారి ప్రశాంతి చేతుల మీదుగా రత్న అవార్డు అందుకున్నారు.

మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సుగుణమ్మను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి(వైద్యం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాజా అధ్యక్షతన స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశపు హాలులో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో కలిసి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం ఉద్యోగ సంఘ నేతలు, వైద్యాధికారులు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను, రుయా మాజీ సూపరింటెండెంట్ భారతిలను సన్మానించి సత్కరించారు. క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

8మంది తమిళ స్మగ్లర్ల అరెస్ట్



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

మంగళం, మార్చి8(ఆంధ్రజ్యోతి): టాస్క్ ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి తమిళనాడుకు చెందిన 8 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ, వినోద్ కుమార్ బృందాలు శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాలలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం స్థానిక అటవీ అధికారులతో కలిసి కూంబింగ్ నిర్వహించారు. పాపానాయుడు పేట బత్తినయ్య కాలనీ సమీపంలో ఓ వాహనంలోని వ్యక్తులు వీరిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి నుంచి మూడు పిడిలేని గొడ్డళ్లను, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన వారు. కారు డ్రైవర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి. వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ కార్యాలయనికి తరలించారు.

'చలో పిఠాపురం' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, పార్టీనాయకులు

తిరుపతి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించి 'చలో పీఠాపురం' పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఆవిష్కరించారు. స్థానిక ఎన్జీవో కాలనీలోని తన నివాసంలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్లు రేవతి, నారాయణ, నరసింహాచారి, ఎస్.కె.బాబు, పొన్నాల చంద్ర, నరేంద్ర, దూది శివ, ఆదం సుధాకర్‌రెడ్డి, యాదవకృష్ణ, వెంకటేశ్వరరావు, హరిశంకర్, బాబ్జి, పగడాల మురళి, జానకిరామ్, ఆకేపాటి సుభాషిణి, కీర్తన, వనజ, లక్ష్మి పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్లో కలంకారీ ఉత్పత్తులపై శిక్షణ

మంగళం, మార్చి8(ఆంధ్రజ్యోతి): తిరుపతి సైన్స్ సెంటర్లో శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రేణిగుంటకు చెందిన దివ్యంగ్ సేవ కేంద్ర ట్రస్ట్, శ్రీకాళహస్తికి చెందిన ఎస్ ఎం కే ఆర్ పెన్ కలంకారి వారి సహకారంతో మహిళలకు కలంకారి ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు. 45 మంది మహిళలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దివ్యంగ్ సేవ కేంద్ర ట్రస్ట్ వ్యవస్థాపకురాలు నెల్లూరు మునిలక్ష్మి, ఎస్ఎంకేఆర్ పెన్ కలంకారి నుంచి టి.మునిరాణి, ఎస్ సుగుణలు శిక్షణ ఇచ్చారు. రీజనల్ సైన్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, పురుషోత్తం, పాల్గొన్నారు.

తిరుపతి(వైద్యం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిలో ఎంఎస్ శ్యాంబాబు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే పద్మావతమ్మ నర్సింగ్ కళాశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో, ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మున్సిపాల్టీలలో పర్యవేక్షణ కమిటీలు అవసరం

తిరుపతి, మార్చి8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో దళిత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల తరహాలో ఏపీలోనూ నిఘా పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి ఎస్సీ ఎస్టీ చట్టాల ద్వారా న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి తెలియజేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆయాగా పనిచేస్తున్న లక్ష్మీదేవి పదోన్నతి విషయంలో కౌన్సిల్ అసలత్వం ప్రదర్శించడం తగదన్నారు. ప్రభుత్వం ఆమెకు పదోన్నతి కల్పించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి (ఆటోనగర్),మార్చి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని 33-11 కేవీ అలిపిరి, పాలిటెక్నిక్ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్ రావు తెలిపారు. మెడికల్ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులు, మెడికల్ కళాశాల, డాక్టర్ల వసతి గృహాలు, చెన్నారెడ్డి కాలనీ, అంబేద్కర్ కాలని, మంచాలవీధి, త్యాగరాజనగర్, సింగాలగుంట, వరదరాజ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగలు మరమ్మతులు చేస్తున్నామని పేర్కొన్నారు.

నడకతో ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలి

తిరుపతి(ఆటోనగర్) మార్చి8: మహిళలు నడక ద్వారా ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వాకింగ్ చేస్తున్న 100 మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం రాజు, చంద్ర, రామస్వామి, రామసుబ్బారెడ్డి, నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువే మహిళలకు ఆయుధం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చదువును ఆయుధంగా చేసుకొని మహిళలు ఎంచుకున్న రంగంలో రాణించాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ పేర్కొన్నారు. పద్మావతి వర్సిటీ సావేరీ హాల్లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి,. స్విమ్స్ కార్డియాలజిస్టు డాక్టర్ వనజాక్షమ్మ, ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ మధుజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జానపద విజ్ఞాన సదస్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ వేదికగా చేపట్టిన మూడు రోజుల జానపద విజ్ఞాన సదస్సు శనివారం ప్రారంభమైంది. భారతీయ పురాణాలు, భారతీయ జానపద, గిరిజన విజ్ఞానం - తులనాత్మక పరిశీలన అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు ప్రాంతాల ప్రతినిధులు పరిశోధనా పత్రాలు సమర్పించారు. వీరికి సదస్సు సంచాలకులు డాక్టర్ డి. నల్లన్న ధ్రువీకరణ పత్రాలు అందజేసి సత్కరించారు.

శేషాచల అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు: డీఆర్వో

చంద్రగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషాచల అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయని పనపాకం డీఆర్వో చినబాబు తెలిపారు. ట్రెకింగ్‌కు, ఇతర అవసరాలకు ఈ అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని శనివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల శేషాచలం అటవీ ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు ఆహ్వానిస్తూ కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. ప్రజా భద్రత దృష్ట్యా అటవీ ప్రాంతంలోకి వెళ్లడంపై నిషేధం విధించామన్నారు. నిబంధనను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

వైద్యానికి వచ్చి వీల్‌చైర్‌తో ఉడాయింపు

తిరిగి స్వాధీనానికి రుయా సిబ్బంది ఆపసోపాలు

తిరుపతి(వైద్యం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): చికిత్స తర్వాత రోగి ఆస్పత్రి వీల్‌చైర్‌తో ఉడాయించిన వైనమిది. పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి(అనంతపరం)ని వైద్యం కోసం కుటుంబ సభ్యులు శుక్రవారం రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఇతనికి అత్యవసర విభాగంలో వైద్య సేవలు అందించారు. అదేరోజు రాత్రి రోగితోపాటు సహాయకులు ఆస్పత్రికి చెందిన వీల్‌చైర్‌ను కూడా తీసుకుని రైలులో అనంతపురం బయల్దేరారు. పీలేరులో రుయాస్పత్రి ఉద్యోగి భర్త వెంకటాచలపతి ఇదే రైలు ఎక్కారు. రుయాస్పత్రి వీల్‌చైర్‌లో కూర్చొనివున్న రోగిని చూసి వెంటనే భార్యకు ఫోన్ చేశారు. ఫోటో తీసి పంపారు. ఆమె హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి అటెండరు అరుణ్‌ను అప్రమత్తం చేశారు. అరుణ్ వెంటనే రైల్వే స్టేషనుకు వెళ్లి వీల్‌చైర్ తీసుకుని దిగిన వారిని గుర్తించి ప్రశ్నించారు. రోగి సహాయకులు అతనితో వాగ్వాదానికి దిగారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో వీల్‌చైర్‌ను అప్పగించారు. దానిని రుయాస్పత్రికి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. స్పందించి సహకరించిన వారిని సూపరింటెండెంట్ రవిప్రభు అభినందించారు.



రైల్లో వీల్‌చైర్‌తోరోగి

ఓటేరు చెరువులో పూడ్చిన మట్టిని వెంటనే తొలగించాలి

వామపక్ష, రైతుసంఘాల నేతలు



తిరుపతిరూరల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు చెరువుని ఆక్రమించేందుకు తోలిన ఎర్రమట్టిని వెంటనే తొలగించాలని సీపీఐ, సీపీఎం, ఆర్‌పీఐ పార్టీ నేతలు శనివారం చెరువుని సందర్శించి డిమాండ్ చేశారు. వీరు మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మీడియా సమావేశంలో.. మాభూముల్లో మట్టితోలామని పబ్లిక్‌గా మాట్లాడినా ఇంతవరకు కేసు నమోదుచేయకపోవడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. ప్రజాపోరాటాల ద్వారా చెరువుని పరిరక్షించు కుంటామని తెలిపారు. వామపక్ష పార్టీల నేతలు పి.మురళి, వందవాసి నాగరాజు, రైతుసంఘం నేత మాంగాటి గోపాల్‌రెడ్డి, ఆర్పీఐ నేత అంజయ్య, పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, పద్మనాభరెడ్డి, ఎండీరవి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నిరశన: చెరువు దురాక్రమణ విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ తెలిపారు. ఆపార్టీ నేతలతో కలసి శనివారం చెరువుని సందర్శించి నిరశన వ్యక్తం చేశారు. బీగాల చంద్రమౌళి, వెంకటరాయల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు చించేశారు: "అవిలాల రెవెన్యూ గ్రామలెక్కదాఖల సర్వేనంబర్ 377 విస్తీర్ణంలోని భూమిపై హైకోర్టులో వాజ్యం నడుస్తోంది. సదరు భూమిని ఆక్రమించుట, భూమిలోకి ప్రవేశించుట చట్టరీత్యా నేరం. ఎవరైనా ప్రవేశించినా లేక ఉల్లంఘించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం" అని తహసీల్దార్ పేరిట ఓటేరు చెరువు వద్ద శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన బోర్డుని సాయంత్రానికల్లా చించివేశారు.

సీబీఎస్‌లో ఆర్టీసీ ఈడీవో పర్యటన



మహిళా కండక్టర్లను సన్మానిస్తున్న ఈడీవో అప్పలరాజు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజు శనివారం ఉదయం రైల్వేస్టేషన్ ముందు ఆర్టీసీ బస్సుల ఆపరేషన్, సెంట్రల్ బస్సుస్టేషన్‌లో పర్యటించారు. రైల్వేస్టేషన్ వద్ద బస్సులోనే ప్రయాణికులకు టిక్కెట్లు జారీచేసే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఏడుకొండల బస్టాండు వద్ద ఎలక్ట్రిక్ బస్సు చార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కండక్టర్లు ఎ.శుభద్ర, ఎ.శ్రీవిద్య, ఎస్.రాజేశ్వరిలను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్రనాయుడు, కంట్రోలర్ ఈఆర్.కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగినులకు సన్మానం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అలిపిరి ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉమెన్స్ ఇనిసియేటివ్స్ డైరెక్టర్ మీరా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెరుగైన పనితీరు కనబరిచిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డిపో మేనేజర్ ప్రశాంతి, ఎంఈలు కళ, చాందిని, అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చార్టర్డ్ అకౌంటెంట్స్

● అఖిలభారత చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి శాఖ అధ్యక్షులు బి.వి.మధుసూదనబాబు, కార్యదర్శి బాలాజీకామిశెట్టి మహిళా చార్టెర్డ్ అకౌంటెంట్లను అభినందించి సన్మానించారు.

శెట్టిపల్లిలో పోలీసుల పల్లెనిద్ర



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

తిరుపతి(నేరవిభాగం)/తిరుపతి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల పరిధిలోని శెట్టిపల్లిలో శుక్రవారం రాత్రి అలిపిరి పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో యువతను సమీకరించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సైబర్‌నేరాలు, ట్రాఫిక్‌రూల్స్, కొత్త వాహన చట్టం ప్రకారం ఉన్న జరిమానాలు, మహిళలపై జరిగే నేరాలు, దురలవాట్ల బారిన పడకుండా తీసుకోవలసిని జాగ్రత్తలపై అగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అలిపిరి పోలీసులు హరినాథ్, నాగయ్య, గ్రామస్తులు గోపి, బుజ్జి, కృష్ణమూర్తి, ప్రభాకర్, జాని పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సేవలు అభినందనీయం

తిరుపతి(ఆటోనగర్) మార్చి8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో మహిళా ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎల్ఐసీ రోడ్డులోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు భవనంలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. మహిళా ఉద్యోగులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, వనజ, సంఘం నాయకులు వెంకటేశంశెట్టి, గోపాల్, మునిక్రిష్ణ, రమణ, జయలక్ష్మి, మెహరున్‌బీ, భాగ్యలక్ష్మి, నవనీతమ్మ, రవణప్ప తదితరులు పాల్గొన్నారు.

మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ ప్రారంభం



టాస్ వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(క్రీడలు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీ యూనివర్శిటీ మైదానంలో శనివారం మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ సెవెన్త్ ఎడిషన్-2025ను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అట్టహాసంగా ప్రారంభించారు. తొలిమ్యాచ్‌లో కలెక్టర్ లెవెన్ -ఎస్పీ లెవెన్ జట్లు తలపడ్డాయి. ఎస్పీ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అమరరాజ -సచివాలయం జట్లు తలపడగా అమరరాజ జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి చీఫ్ ఆర్గనైజర్‌గా చీర్ల కిరణ్ వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా పీపీ రాయలు, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా 10 కార్పొరేట్ జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 19 తేదీ వరకు కొనసాగుతుంది. ప్రతి జట్టు లీగ్‌దశలో నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది.

105 మంది వీధి వ్యాపారులకు జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 105 మంది వీధి వ్యాపారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిని తిరుపతి స్పెషల్ కోర్టు ఇన్‌చార్జి మూడవ అదనపు జ్యూడిషియల్ సివిల్ న్యాయమూర్తి సంధ్యారాణి ఎదుట శనివారం హాజరు పరిచారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.500 వంతున మొత్తం రూ 52,500 జరిమానా విధించారు.

మద్యం దుకాణంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కు సమీపంలో ఉన్న కల్లూరి వైన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. వైన్ షాపు పైన వున్న షీట్లు కట్ చేసి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లో వున్న రూ 20వేల నగదు, రూ.30 వేల విలువ చేసే 15 మద్యం బాటిళ్ల చోరీచేశారు. దుకాణం నిర్వాహకులు శనివారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుకాణం యజమాని నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం

తిరుపతి (జీవకోన), మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి క్యాంపు కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, భూమన కరుణాకర రెడ్డి, అభినయ్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవిరెడ్డి, వైసీపీ మహిళ కార్పొ రేటర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి: ఎస్పీ



విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవానికి సార్థకత ఉంటుందని ఎస్పీ హర్ష వర్ధనరాజు అన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొద్ది రోజులుగా విద్యాసంస్థల్లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి ఎస్పీ బహుమతులు, మెమెంటోలు అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన భవ్యశ్రీ, సాయితేజ, పద్మప్రియ, హర్షిత, ద్రాక్షాయణి, కీర్తి, శ్యామల, దీక్షిత, వైష్ణవికి బహుమతులు అందజేశారు.

మహిళా దినోత్సవం వేడుక కాదు

మహిళా శక్తికి నిదర్శనం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం వేడుక కాదు.. మహిళా శక్తికి నిదర్శనమని ఏఎస్పీ రవిమనోహరాచారి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బాలాజీ కాలనీ సర్కిల్ వరకు విద్యార్థులు, పోలీసులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు మురళీ మోహన్‌రావు, రామయ్య, శ్రీరాములు, దీపిక, ట్రాఫిక్ ఎస్ఐ విజయలక్ష్మి, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంటు సోమశేకర్, శంకర్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సేవల్లో మహిళల పాత్ర కీలకం



రైల్వే స్టేషన్‌లో కేక్‌కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

తిరుపతి(సెంట్రల్) మార్చి8 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేలో లక్షల మంది ప్రయా ణికుల సేవల్లో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకమైందని తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్టేషన్‌లోని వీఐపీ చాంబర్‌లో మహిళల ఉద్యోగులతో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ చిన్నప్పరెడ్డి, ఐపీఎఫ్ మధుసూదన్, జగన్మోహన్, రత్నానాయక్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం దుకాణ ఫ్లెక్సీ దహనం



వైన్ షాపు ముందు బ్యానర్ దగ్ధం చేస్తున్న మహిళలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ సాయినగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న మద్యం దుకాణం తొలగించాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. శనివారం మహి ళా దినోత్సవం సంద ర్భంగా రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దుకాణం వద్ద నిరసన తెలిపారు. వైన్ షాపు బ్యానర్లు దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నివాసాలు, బ్యాంకులు, ఆలయాలు, విద్యాసంస్థల మధ్య వైన్ షాపును తొలగించ కుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో మహిళా సమాఖ్య రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నదియ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మంజుల, రత్నమ్మ, ప్రమీల, లక్ష్మి పాల్గొన్నారు.

చిరువ్యాపారుల సమస్యలు

ఎన్ని రోజులకు పరిష్కరిస్తారు?

తిరుపతి (ఆటోనగర్), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు చిరువ్యాపారుల సమ స్యలు పరిష్కరించడానికి అధికారులకు, పాలక మండలికి ఇంకా ఎన్నిరోజులు కావాలని సీఐటీయూ నాయకులు కందారపు మురళి, ఎస్.జయచంద్ర ప్రశ్నించారు. స్థానిక టీటీడీ పరిపాలన భవనం ఎదుట 200 రోజులుగా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు రిలే దీక్షలు చేస్తున్నారు. శనివారం దీక్షా శిబిరం వద్ద హోమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిట్టిబాబు, మధు, యుగంధర్, చిరంజీవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమానికి స్ఫూర్తిదాయకం బాలానందన్ జీవితం

తిరుపతి(ఆటోనగర్) మార్చి8(ఆంధ్రజ్యోతి): కార్మిక ఉద్యమాలకు సీఐటీయూ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బాలానందన్ జీవితం స్ఫూర్తిదాయకమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్థానిక యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన భవన్‌లో శనివారం బాలానందన్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాయలసీమ స్థాయి సీఐటీయూ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీ.బాలసుబ్రమణ్యం, ఓబులు, కందారపు మురళి, అజయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



తిరుపతి (నేరవిభాగం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం తిరుపతి ఎస్వీయూ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రామయ్య కథనం మేరకు.. దాదాపు 45 నుంచి 50 సంవత్సరాల వయసున్న వ్యక్తి కొంత కాలంగా స్థానికంగా టీ దుకాణంలో పనిచేసేవాడు. ఇటీవల అక్కడ పని మానేశాడు. ఈ క్రమంలో స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల వద్ద వున్న రైల్వే ట్రాక్ పక్కన స్లీపర్ సిమెంటు దిమ్మెలపై మృతిచెంది ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. వివరాలు ఎవరికైనా తెలిస్తే ఎస్వీ యూనివర్శిటీ సీఐ 9491074524కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఉత్తమ కండక్టర్‌గా రత్న



ఆర్టీసీ అధికారి ప్రశాంతి నుంచి అవార్డు అందుకుంటున్న కండక్టర్ రత్న

సూళ్లూరుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సంగన రత్న జిల్లా స్థాయిలో ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆర్టీసీ ఉద్యోగులకు జిల్లా స్థాయిలో పురస్కారాలు అందించారు. శనివారం తిరుపతిలోని అలిపిరి డిపోలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి ప్రశాంతి చేతుల మీదుగా రత్న అవార్డు అందుకున్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: కురుగొండ్ల

డక్కిలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వినతిపత్రాలు సమర్పించారు. ఎక్కువగా పింఛన్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలపై అర్జీలు అందించారు. ఒక దశలో జనం ఒక్కసారిగా దూసుకురావడంతో వారిని అదుపు చేయలేక పోలీసులు ఇబ్బందులు పడ్డారు. ఎంత రాత్రయినా ప్రతి ఒక్కరితో మాట్లాడి సమస్య తెలుసుకుంటానని ఎమ్మెల్యే చెప్పడంతో ప్రజలు క్యూ పద్ధతి పాటించి వినతులు అందజేశారు. అనంతరం ఎన్టీఆర్ పక్కాగృహాల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఎస్‌ఐ శివ శంకర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక, మండల సర్వేయర్ రాజగోపాల్, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం

గూడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందజేసేందుకు అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, శివకుమార్, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ

కోట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి అరుంధతీయ వాడకు చెందిన వివాహిత గంగిపాక ఫాతిమా(18) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అల్లుడు, అతని తల్లి వేధింపుల కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఫాతిమా తల్లిదండ్రులు పుల్లయ్య, అరుణ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఫాతిమా భర్త మనోహర్, అతని తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ క్రమంలో గూడూరు డీఎస్పీ గీతాకుమారి గూడలిలో ఫాతిమా ఉరి వేసుకున్న స్థలాన్ని పరిశీలించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తిక్కవరం గ్రామంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను అదే గ్రామానికి చెందిన కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని, వారి చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిక్కవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుని వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో దయాకర్, ఆరికట్ల బాలకృష్ణ మనాయుడు, శ్రీనివాసులు, నిరంజన్, శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత


మహిళా దినోత్సవ కార్యక్రమంలో తెలుగు మహిళలు

గూడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లీలా వతి, భారతి, శ్రీదేవి, కల్పన, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని కల్లిపేడువాసి మృతి

నాయుడుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం విన్నమాల సమీపాన శనివారం రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందినట్లు సూళ్లూరుపేట రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు గుర్తించారు. మృతుడు కల్లిపేడుకు చెందిన కాపులూరు మణి(48)గా గుర్తించారు. మృతుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు.

3 నుంచి గంధోత్సవం

నాయుడుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని హజరత్ అమీషా వల్లీ గంధోత్సవాన్ని ఏప్రిల్ 3,4,5 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో దర్గా కమిటీ, వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల సమావేశం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయుడుపేటలో ఎన్నో దశాబ్దాలుగా జరుగుతున్న గంధోత్సవం అనివార్య కారణాల వల్ల ఆగిపోవడం బాధాకరమన్నారు. ఈ ఏడాది అందరి సహకారంతో గంధోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. గంధోమహోత్సవ కమిటీ అధ్యక్షుడుగా నెలవల సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తారన్నారు. సమావేశంలో సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణయ్య, న్యాయవాది పసల గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపాచీ పరిశ్రమలో భద్రతా వారోత్సవాలు

తడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అపాచీ పరిశ్రమలో జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. హెల్మెట్ వాడకం, రోడ్డు భద్రతపై కార్మికులకు అవగాహన కల్పించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులతో భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



గూడూరులో మహిళను సన్మానిస్తున్న డీఎస్పీ గీతాకుమారి - నాయుడుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, కమిషనర్ ఫజులుల్లా తదితరులు

గూడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం గూడూరులోని బ్రహ్మణ సేవాసంఘ సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ సృష్టికి మూలమైన మహిళలను గౌరవించడం మన సంప్రదాయమన్నారు. కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలే కీలకమన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లితే ఏ రంగంలోనైనా రాణించగలరన్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఆనిమెళ్ల శివకుమార్, శ్రీనివాసరావు, లలిత, నరసింహరావు, రామ్మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక షాదీ మంజిల్‌లో పట్టణ మెప్మా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ గీతాకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో పెంచలయ్య, చందన, లత, ఉష, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: మహిళలకు ఎక్కడ సముచిత స్థానం ప్రాధాన్యం ఉంటుందో అక్కడే పురోగతి ఉంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవనంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీ, మున్సిపల్ చైర్ పర్సన కటకం దీపికను సన్మానించారు. అలాగే మెప్మాలో ప్రతిభ కనబరిచిన మహిళలతో పాటు వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు.

మహిళలు స్వశక్తితో ఉన్నతంగా ఎదగాలి: కురుగొండ్ల


మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దొంతు శారదను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో సీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని చెప్పారు. రాజకీయాలతో పాటు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని అన్నారు. మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. అంతకుముందు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీపీ తనూజారెడ్డి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే సన్మానించారు. మెప్మా ద్వారా పొదుపు మహిళలకు మంజూరైన రూ.44కోట్ల రుణాలకు సంబందించి చెక్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సీఐ రమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, నాయకులు సత్యనారాయణ, చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వరరెడ్డి, కేవీకే ప్రసాద్ నాయుడు, కౌన్సిలర్లు పోట్టేళ్ల శిరీషా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు
ఒకరి మృతి, మరొకరికి గాయాలు



సతీష్‌కుమార్ (ఫైల్‌ఫొటో), గాయపడిన శిరీషారెడ్డి

పెళ్లకూరు, మార్చి 8 (ఆంధ్రజోతి): అదుపు తప్పిన కారు డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మండలంలోని తాళ్వాయిపాడు వద్ద 71వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు... బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న ఎంవీ సతీష్ కుమార్(40), శిరీషారెడ్డి గుడివాడకు బయలుదేరారు. తాళ్వాయిపాడు సమీపంలో జాతీయ రహదారి వంతెన వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సతీష్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, శిరీషారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్‌కుమార్ మృతి చెందాడు. శిరీషారెడ్డిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ బస్సును ఢీకొన్న లారీ
ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు, మార్చి 8 (ఆంధ్రజోతి): ఆగివున్న ప్రైవేట్ బస్సును లారీ ఢీకొనడంతో ఇద్దరు గాయాలైన ఘటన మండలంలోని పెన్నేపల్లి 71వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది.. పోలీసుల సమాచారం మేరకు... శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు పెన్నేపల్లి వద్ద ప్రయాణికులను దింపేందుకు ఆగింది. అదే సమయంలో వెనుక వస్తున్న లారీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రవికితో పాటు బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పర్వీన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు బహుమతులు



మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న ఈఈ సురేంద్ర

వెంకటగిరి టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరిగిన ఏపీ ఎన్జీవో జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో వెంకటగిరి తాలూకా మహిళా ఉద్యోగులు ప్రతిభ చూపారు. ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న ఎల్.కృష్ణకుమారి, పసుపులేటి హరిప్రియ జట్టు షటిల్ బ్యాడ్మింటన్‌లో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే వంద మీటర్ల పరుగు పందెంలో కృష్ణకుమారి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. వీరికి ఇరిగేషన్ ఈఈ సురేంద్ర శనివారం బహుమతులు అందజేశారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



గూడూరులో న్యాయవాది వెంకటేశ్వరరావుకు సర్టిఫికెట్ అందజేస్తున్న జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానా బేగం - సూళ్లూరుపేటలో కోర్టులో ఓ దంపతుల కేసును రాజీ చేస్తున్న న్యాయమూర్తి కరుణకుమార్, పక్కనే పోలీసులు

గూడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకునే వీలుంటుందని ఏడవ అదపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. శనివారం గూడూరు కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకే కేసులు పెట్టుకుని సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్ ద్వారా రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్ అదాలత్‌లో బ్యాంకులు, రుణ గ్రహీతల కేసులను సమర్థవంతంగా పరిష్కరించడంలో చొరవ చూపుతున్న సీనియర్ న్యాయవాది వెంకటేశ్వరరావు సేవలను గుర్తించి సన్మానించారు. సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: లోక్‌అదాలత్‌లో ఇరువర్గాలకూ న్యాయం జరుగుతుందని నెల్లూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కరుణ్‌కుమార్ అన్నారు. నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం ఆయన ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 613 కేసులను పరిష్కరించారు. వివిధ కేసుల్లోని బాధితులకు రూ.3,23,130 నష్టపరిహారంగా చెల్లించేలా ఆదేశించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కరుణకుమార్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. మొత్తం 1,223 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదులు, సీఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. మండల పరిధిలోని కొండూరు పంచాయతీ సుందరపురం గ్రామానికి చెందిన తొప్పాని అంకయ్య కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. అదేరోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. తలుపులు తెరిచి ఉండడంతో శుక్రవారం సాయంత్రం సమయంలో చుట్టుపక్కల వారు ఇంటి యజమానికి సమాచారం అందించారు. ఆయన హుటాహుటిన గుంటూరు నుంచి ఇంటికి చేరుకున్నారు. తాళాలు పగలగొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న రూ.70 నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్ల వెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం

పెళ్లకూరు, మార్చి 8 (ఆంధ్రజోతి): పెళ్లకూరు మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కట్ల రమణమ్మ, దామతోటి తిరుపాలు రేణిగుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వారిద్దరూ మెగా ఇంజినీరింగ్ సంస్థ కూలీలు కావడంతో ఆ సంస్థ యాజమాన్యం ఒకొక్కరికి రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఆ చెక్కులను బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శనివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, బంగారంపేట సర్పంచు నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, సిద్దులయ్య నాయుడు, ఉదయ్‌కుమార్ నాయుడు, నరేంద్ర నాయుడు, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

జాతీయ లోక్ అదాలత్‌లో
807 కేసుల పరిష్కారం
- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర వెల్లడి


కేసుల విచారణలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 807 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. కాగా, రూ.2.74 కోట్ల మొత్తాన్ని రాజీ చేసినట్లు వివరించారు. అందులో 43 సివిల్ కేసులను పరిష్కరించి రూ.1.71 కోట్లు, 760 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ.1కోటి, 4 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించి రూ.3.19 లక్షలను రాజీ చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. న్యాయవాదులు మురుగేషన్ రెడ్డి, దినకర్, సారథి బెంచ్ మెంబర్లుగా వ్యవహరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను పలువురు సద్వినియోగం చేసుకుని రాజీ పడ్డారు.

పురుషులతో సమానంగా మహిళల ముందంజ



హిమజ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న నిషిధరాజు - సుభాషిణి ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు, మహిళా సిబ్బందికి సన్మానం

పుత్తూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు నిషిద రాజు అన్నారు. స్థానిక హిమజ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు భువనేశ్వరి, తులసి, వరలక్ష్మి, పుష్ప అధ్యాపకులు శిల్పా, అరుణ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులు శ్రీదేవి, వాణశ్రీ, దేవకి, వాసవి, సుజనలను, శ్రీవిద్యాడిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులను సన్మానించారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సుభాషిణి ఆస్పత్రి, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆస్పత్రిలో డాక్టరు సుభాషిణి, నర్సులు నీలిమ, ద్రాక్షాయణి, మౌనిక, మంజుల, పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రవిమార్ పర్యవేక్షణలో మహిళా కానిస్టేబుళ్లు కృష్ణకుమారి, యమునలను, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హెచ్‌ఎం కృష్ణవేణి, మునిలక్ష్మి, భారతి, మనోహరిని సన్మానించారు. ఈ మూడు కార్యక్రమాల్లో వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ మాధవనాయుడు, ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిరాజు, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ శ్రీధర్‌రాజు, కెఎల్ఎన్ మూర్తి, రఫీ, మునికృష్ణయ్య, గుణశేఖర్‌రెడ్డి, రమణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మహిళల పాత్ర అమూల్యం

పుత్తూరు అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి పాల్గొని మాట్లాడుతూ తల్లులు, సోదరీమణులు, భార్యలు,సహోద్యోగులు, స్నేహితులుగా మహిళలు పోషించే అమూల్యమైన పాత్రలని కొనియాడారు.

మహిళలు మహారాణులు


మహిళలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్

మహిళా సాధికారతతో నేడు మహారాణులు వెలుగొందుతున్నారని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలతో పాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలకు కమిషనర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రతినిధి సునీత తదితరులు పాల్గొన్నారు.

మృతుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే పరామర్శ


మంజునాథ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 8(ఆంధ్ర జ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కుమారులను కోల్పోయిన తల్లిదండ్రులు లక్ష్మీ, మంజునాథ్‌లను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శించారు. శనివారం పుత్తూరు పరిధిలోని నేసనూరు పంచాయతీ గట్టు గ్రామంలోని వారి నివాసానికి ఎమ్మెల్యేతో పాటు పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య వెళ్లారు. ముందుగా మృతి చెందిన మునికుమార్, రవిశేఖర్‌ల చిత్రపటానికి నివాళులు అర్పించారు. కొండంత అండగా నిలుస్తారని భావించిన కొడుకులు ఇద్దరు తమను ఒంటరిని చేసి వెళ్లిపోయారంటూ తల్లిదండ్రులు బోరున విలపించగా, ఎమ్మెల్యే వారిని ఓదార్చారు. ఏదేని పరిహారం విషయంలో వీలైనంత త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. టీడీపీ నాయకులు కరుణా యాదవ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై దర్శనమిచ్చిన సుబ్రహ్మణ్యేశ్వరుడు



పుత్తూరు టౌన్, మార్చి (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో వెలిసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గజ వాహనంపై ఊరేగారు. శనివారం ఉదయం అమ్మవార్ల సమేత స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు వారు గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

రాస్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే బొజ్జల



మహిళా కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

రేణిగుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాస్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల పరిధిలోని కరకంబాడిలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాస్ పని చేస్తుందని కొనియాడారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా నిరుపేద మహిళను గుర్తించి, సంఘాలుగా ఏర్పాటుచేసి వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని, ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరచడానికి సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం టైలరింగ్ శిక్షణ తరగతుల భవనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించి, 30 మంది వృద్ధులకు వీల్ చైర్స్, చేతి కర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. రాస్ సంయుక్త కార్యదర్శి మమత, మహిళా వికాస్ అధ్యక్షురాలు సుమతి, డీసీవె లక్ష్మి, రాజశేఖర్ నాయుడు, ప్రాజెక్టు డైరెక్టర్లు నాగరాజు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పు అంతిమం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ ద్వారా పొందే తీర్పు అంతిమంగా పరిగణింపబడుతుందని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ ద్వారా చేకూరే ఎన్నో ప్రయోజనాలను ఫిర్యాదుదారులు, కక్షిదారులకు వివరించారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. మొత్తం 11 విభాగాలల్లో 285 కేసులకు గాను రూ.94,74,377నగదు సంబంధిత కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ, పలుప్రభుత్వ శాఖల అధికారులు, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 53 కేసుల రాజీ

రేణిగుంట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్, గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 53 కేసులు రాజీ అయినట్లు ఎస్‌ఐలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024లో గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్, క్రిమినల్ 22, అర్బన్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్, క్రిమినల్, పెట్టీ కేసులకు సంబంధించిన తిరుపతి కోర్టు ప్రాంగణంలో ఒకటవ అదనపు న్యాయమూర్తి సత్యకాంత్ కుమార్ జరిమానా విధించి, రాజీ చేశారని తెలిపారు.

మహిళా సాధికారతకు నిదర్శనం హెరిటేజ్ డెయిరీ



మహిళా పాడి రైతులను సన్మానిస్తున్న హెరిటేజ్ డెయిరీ యాజమాన్యం

నారాయణవనం(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత నిదర్శనం హెరిటేజ్ డెయిరీ అని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎస్.హెచ్.సర్వోత్తమరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కళ్యాణపురంలో ఉన్న హెరిటేజ్ పాల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వత్తమరెడ్డి పాల డెయిరీలో పాడి రైతులు, పాల సేకరణ ప్రతినిధులను, మహిళా రైతులను శాలువాలు కప్పి సన్మానించారు. కళ్యాణపురం డెయిరీ మేనేజర్ శేఖర్, సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, శ్రీవిద్య సంస్థల డైరెక్టర్ రేవతి, కరస్పాండెంట్ ఉమామహేశ్వర్, పాడి రైతులు పాల్గొన్నారు.

శ్రీవిద్యలో ఘనంగా కిండర్‌గార్టెన్ వేడుకలు



చిన్నారుల డ్యాన్స్

సత్యవేడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవిద్య ఇంగ్లీష్ హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ నాగయ్య ఆధ్వర్యంలో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చడంతో పాటు పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడేలా ఆత్మస్థైరాన్ని అందించాలని కోరారు. అనంతరం చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ, వైస్ ప్రిన్సిపాల్ హేమావతి, హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన కాపునాడు నాయకులు



గరికపాటి చంద్రశేఖర్ తదితరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

శ్రీకాళహస్తి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలోకి శనివారం పలువురు కాపునాడు నాయకులు చేరారు. జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పసుపులేని హరిప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాపునాడు పట్టణాధ్యక్షుడు గరికపాటి చంద్రశేఖర్, నాయకులు భాస్కర్, పగడాల ప్రతాప్, పగడాల సుధాకర్, తలిశెట్టి బాలాజీ, సురేష్ బాబు, షేక్ మహ్మద్ బాషా చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, దండి రాఘవయ్య, వేణు, చిరంజీవి, లీలాధర్, శశి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేణిగుంట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూకివాకం, కరకంబాడి, గురువురాజుపల్లి, ఎల్లమండ్యం, గాజులమండ్యం, కుర్రకాలువ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని ఆశాఖ డీఈఈ రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ ఆలయ కుంభాభిషేకం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 8ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరిలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మమ్మ దేవత ఆలయ కుంభాభిషేకంలో భాగంగా శనివారం అమ్మవారికి పంచామృత అభిషేకం వైభవంగా జరిగింది. మహాలక్ష్మమ్మ విగ్రహాన్ని మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, కుంభస్థాపన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మహిళా సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం



పిచ్చాటూరులో మహిళలను సన్మానించిన ఎమ్మెల్యే ఆదిమూలం





శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు - మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కోట వినుత

పిచ్చాటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మహిళలను సత్కరించి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పద్దురాజు, వాసురెడ్డి, దొరవేలురెడ్డి, చిన్నా, డిల్లీబాబు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పిచ్చాటూరు మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు సమాఖ్య ఏపీఎం చంద్రకళ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. సంఘ మిత్రలు ఏపీఎం చంద్రకళను శాలువతో సత్కరించారు. సీసీ శశికళ, నాగేంద్రబాబు, సుబ్రహ్మణ్యం, రజని తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): రాయపేడులో జాయ్ ట్యూషన్ సెంటర్ ఫర్ చిల్డ్రన్‌సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జాయ్ ట్రస్టు అధినేత సెల్వరాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారు. ఏపీఎం చంద్రకళ, జాయ్ ట్రస్టు సభ్యులు, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, అన్ను, మల్లికార్జునరెడ్డి, డాక్టర్ రమేష్, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత స్వగృహం వద్ద శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పురపాలక సంఘ పరిధిలో పనిచేస్తున్న మహిళా కార్మికులను ఘనంగా సన్మానించి, చీరలు పంపిణీ చేశారు. వీరమహిళలు భాగ్యలక్ష్మి, శారద, రాజ్యలక్ష్మి, లక్ష్మి, కవిత, పుష్ప, గాయత్రి, నిర్మల తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ఆర్టీసీ మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీనివాసకుమార్, జీపీఎస్ ఆచారి, లింగమూర్తి, కుప్పయ్య, గోవర్ధన్, నిర్మలమ్మ, నిర్మల, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇక సీపీఐ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్‌ఐ లావణ్య, ప్రజానాట్యమండలి తిరుపతి జిల్లా కార్యదర్శి చారులతను సన్మానించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, గోపి, ఏఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శి కోగిల మునిచందు, మించల శివకుమార్, రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో మహిళా నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సుమతి, మల్లీశ్వరి, రేణుకాదేవి, సుప్రజ, కుమారి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లావణ్య, సంస్థ సభ్యులు హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలోని చెంచులక్ష్మి మ్యాక్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. చెంచులక్ష్మి మ్యాక్స్ అధ్యక్షురాలు అనితాలక్ష్మి, ప్రజా ప్రగతి ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులు, మండల కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, మహిళలు పాల్గొన్నారు.

నారాయణవనం(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తిరుపతి అంకుర వైద్యశాల గైనాకాలజిస్ట్ రేష్మారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ అంతర్జాతీయంగా మహిళలకు సముచిత స్థానం ఉన్నదని, దీనిని సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన రాజు సిబ్బంది రేష్మారెడ్డిని సన్మానించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



రేష్మారాజును సన్మానిస్తున్న సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్‌రాజు

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వరదయ్యపాళెం పంచాయతీ ఈవో బసిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. అదేవిధంగా కడూరులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత శ్రీనివాసులు, టీడీపీ నాయకులు వెంకటయ్య, జనసేన నాయకులు తడ శ్రీనివాసులు, విజయకుమార్, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో మహిళా పారిశుధ్య కార్మికులను సెక్రటరీలు, సర్పంచులు సన్మానించారు. రైల్వే పెన్షనర్స్ కార్యాలయంలో మహిళా పెన్షనర్లను సన్మానించారు. జీఎం వీధిలో ఐద్వా ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అలాగే సీపీఎం కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

'గుమ్మడికాయల' చందంగా ఎస్సీవీ తీరు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గుమ్మడి కాయల దొంగ అంటే ఎవరో భుజాలు తడుముకున్నారన్న చందంగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తీరు ఉందని టీడీపీ నాయకులు ఎద్దేవా చేశారు. తిరుపతి ఓటేరు భూములను కాపాడాలంటూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అసెంబ్లీలో విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై పలువురు టీడీపీ నేతలు శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణాధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ బొజ్జల కుటుంబం నీతి నిజాయితీకి మారుపేరుగా శ్రీకాళహస్తి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, సుధీర్‌రెడ్డిపై అక్కసుతో అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు మాట్లాడుతూ ఐదేళ్లు మధుసూదన్‌రెడ్డితో అంటకాగిన ఎస్సీవీనాయుడు ప్రస్తుతం పార్టీ మారినప్పటికీ తన రహస్య స్నేహం కొనసాగిస్తున్నారన్నారు. పాలసరఫరా సంఘం మాజీ చైర్మన్ మునిరాజానాయుడు, మాజీ కౌన్సిలరు నాగమల్లి దుర్గాప్రసాద్, ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ సభ్యుడు కాసరం రమేష్, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు హేమంత్‌రాయల్ తెలుగుదేశం పార్టీని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఊరుకోమని హెచ్చరించారు.

బీసీ నేతల ఖండన

కాగా కొందరు టీడీపీ బీసీ నాయకులు శనివారం మీడియాతో మాట్లాడుతూ, ఎస్సీవీ వ్యాఖ్యలను ఖండించారు. ఓటేరు భూముల విషయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం ఎలా తప్పు అవుతుందన్నారు. మిన్నల రవి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, సునీల్, భాస్కర్, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవీ వర్గం ఎదురు దాడి

ఇలా ఉండగా వీరి వ్యాఖ్యలపై ఎస్సీవీనాయుడు వర్గీయులు, మాజీ పాలకమండలి సభ్యుడు నారాయణయాదవ్, పలువురు నాయకులతో కలిసి వీడియో విడుదల చేశారు. తమ నాయకుడు ఎస్సీవీనాయుడిని విమర్శించడం తగదని హెచ్చరించారు. ఇల్లు ముట్టడిస్తాం అంటూ, దాడులు చేస్తామంటూ హెచ్చరిస్తూ వీడియోలు విడుదల చేస్తే ఊరుకోమన్నారు.

తెలుగు మహిళ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి

రేణిగుంట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తెలుగు మహిళ కార్యకర్త మృతి చెందడంతో ఆమె భౌతికకాయానికి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నివాళులు అర్పించారు. శనివారం మండల పరిధిలోని వెంకటాపురం పంచాయతీ అన్నసంపల్లి క్లస్టర్ ఇంచార్జి నాదమునిరెడ్డి బంధువు, తెలుగు మహిళ కార్యకర్త మునిలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ గ్రామానికి చేరుకుని మునిలక్ష్మి భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేష అలంకరణతో పూజలు నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

నారాయణవనం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భీముని చెరువు గుట్టలో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న 5 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దారు జయరాములు తెలిపారు. తమ గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు మేరకు పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది గుట్ట వద్ద మట్టిని త్రవ్వుతున్న జేసీబీని,మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రేణిగుంట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన శనివారం తెల్లవారు జామున టపాసుల గోడౌన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు టపాసుల గోడౌన్ వెనుక ఉన్న గృహ సముదాయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కేశవ కుటుంబ సభ్యులతో కలిసి తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి వెళ్లగా ఉదయం 5 గంటలకు ఇంటిలోని పూజగదిలో షార్ట్ సర్క్యూట్ కావడంతో పొగలు బయటకు వచ్చాయి. స్థానికులు గుర్తించి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటికి అంటుకున్న మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంటి యజమాని కేశవ మాట్లాడుతూ ఇటీవల నూతనంగా గృహ ప్రవేశం చేశామని, అగ్ని ప్రమాదం వల్ల పూజ గదిలో వెండి సామాగ్రి, హాల్లో విలువైన వస్తువులు కరిగిపోయాయని, రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. అగ్ని మాపక అధికారి కిరణ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పవన్‌ను విమర్శించే అర్హత జగన్‌కు లేదు

సత్యవేడు, మార్చి 8: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని సత్యవేడు మండల జనసేన అధ్యక్షుడు రూపేష్‌కుమార్ అన్నారు. శనివారం సత్యవేడులో ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్‌పై జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఒక స్థానం నుంచి 21స్థానాల వరకు నూరు శాతం గెలుపుతో ఎదిగిన తమ అధినేత పవన్‌ను 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పరిమితమైన జగన్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాడేపల్లిలో కూర్చుని ప్రెస్‌మీట్‌లలో కబుర్లు చెప్పడం మానుకుని అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. నాయకులు హేమంత్ కుమార్, కుమార్, అనిల్ కుమార్, ధనుష్, శ్రీను, మునికుమార్ పాల్గొన్నారు.